జూలై 1 నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు

న్యూఢిల్లీ: భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య.. పేర్లతో తీసుకొచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయని కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్ తాజాగా ప్రకటించారు. ' కొత్త చట్టాలు దేశ లోని క్రిమినల్ న్యాయ వ్యవస్థకు అత్యంత కీలకం. నేర స్వభావాన్ని బట్టి సాధారణ నేరాల్లో పోలీస్ కస్టడీ 15 రోజుల నుంచి 90 రోజులకు పెరిగింది. అలాగే భారతీయ న్యాయ సంహితలో కొత్తగా 20 నేరాల్ని చేర్చాం' అని తెలిపారు.

క్షీణిస్తున్న సారవంతమైన భూమి

న్యూఢిల్లీ: సెకనుకు నాలుగు ఫుట్ బాల్ మైదానాలతో సమానమైన సారవంతమైన భూమిని ప్రపంచం కోల్పోతున్నట్టు ఐక్యరాజ్యసమితి చీఫ్ ఆంటోనియో గుటెరెస్ ఆందోళన వ్యక్తంచేశారు. ఎడారీకరణ, కరువును ఎదుర్కోవడానికి గుర్తుగా జూన్ 17న జరుపుకొనే ప్రపంచ దినోత్సవానికి ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కోట్లాదిమంది ప్రజల భద్రత, శ్రేయస్సు, ఆరోగ్యం, జీవితాలు, జీవనోపాధి, పర్యావరణ వ్యవస్థ వంటివి అభివృద్ధి చెందుతున్న భూములపై ఆధారపడి ఉంటాయని గుటెరస్ పేర్కొన్నారు. కానీ, మనం మాత్రం మనల్ని నిలబెట్టే భూమిని నాశనం చేస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు.

'ప్రేరణ స్థల్' ప్రారంభం

పార్లమెంట్‌లో విగ్రహాల తరలింపుపై వివాదం

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో 'ప్రేరణ స్థల్'ను ఉప రాష్ట్రపతి ధనకర్ ఆదివారం ప్రారంభించారు. ఇప్పటి వరకు పార్లమెంట్ పరిసరాల్లో వివిధ చోట్ల ఉన్న గాంధీ, అంబేద్కర్ సహా జాతీయ ప్రముఖులు, స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలన్నింటినీ ఒక్కచోటకు మార్చారు. ఈ ప్రేరణ స్థల్ ప్రజలకు స్ఫూర్తి, ప్రేరణను ఇస్తుందని ధనకర్ పేర్కొన్నారు. విగ్రహాల తరలింపు కేంద్రం ఏకపక్ష నిర్ణయమని కాంగ్రెస్ విమర్శించింది.

ఈవీఎంలూ హ్యాక్ చేయొచ్చు

- సాధ్యమేనన్న టెస్లా సీఈవో ఎలాన్ మస్క్
- మనుషులు లేదా ఏఐతో హ్యాకింగ్ ముప్పు
- ఈవీఎంలను తొలగించాలని మస్క్ సూచన
- మా ఈవీఎంలను హ్యాక్ చేయలేరు: కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్
- ఏదైనా హ్యాకింగ్ చేయొచ్చు: మస్క్ కౌంటర్
- మా ఈవీఎంలు 'బ్లాక్ బాక్స్'లు: రాహుల్

న్యూఢిల్లీ, జూన్ 16: ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంపై ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న వేళ టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. మనుషులు లేదా కృత్రిమ మేధ(ఏఐ)తో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)లను హ్యాక్ చేసే ముప్పు ఉందని మస్క్ పేర్కొన్నారు. ఈవీఎంలను తొలగించాలని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా నియంత్రణలోని ఫ్యూర్టో రికోలో ఇటీవల జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్ 'ఎక్స్'లో చేసిన ఒక పోస్ట్‌కు ఎలాన్ మస్క్ ఈ విధంగా స్పందించారు. ఫ్యూర్టో రికో ప్రైమరీ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌లకు సంబంధించి వందలాది ఓటింగ్ అక్రమాలు వెలుగులోకి వచ్చాయని రాబర్ట్ ఆరోపించారు. ఈ మేరకు ఒక వార్తా కథనాన్ని ఆయన తన పోస్ట్‌కు జత చేశారు. అధ్యక్షవశాత్తూ పేపర్ ట్రయల్ ఉంది కాబట్టి సమస్యను గుర్తించి, ఓట్ల లెక్కను సరి చేయడం జరిగిందని అన్నారు. పేపర్ ట్రయల్ లేని ప్రాంతాల్లో ఇదే జరిగితే పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. తమ ప్రతి ఓటు లెక్కించారని, తమ ఎన్నికల్లో హ్యాకింగ్ జరగదని అమెరికా పౌరులు తెలుసుకోగలగాలని పేర్కొన్నారు. ఇందు కోసం ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ జోక్యాన్ని నివారించేందుకు మళ్లీ పేపర్ బ్యాలెట్లను వెనక్కు తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు.

మస్క్ వర్సెస్ రాజీవ్

మస్క్ చేసిన ట్వీట్ భారత్‌కు సంబంధించినది కాకపోయినప్పటికీ బీజేపీ నేత, గత ప్రభుత్వంలో ఐటీ శాఖ మంత్రిగా పని చేసిన రాజీవ్ చంద్రశేఖర్ స్పందించి కౌంటర్ ఇచ్చారు. ఇంటర్నెట్‌తో అనుసంధానం అయి ఉండే ఓటింగ్ యంత్రాలు వాడుతున్న అమెరికాకో, ఇతర ప్రాంతాలకో ఎలాన్ మస్క్ అభిప్రాయం వర్తిస్తుండొచ్చని పేర్కొన్నారు. సురక్షితమైన డిజిటల్ హార్డ్‌వేర్‌ను ఎవరూ తయారుచేయలేరనేలా అన్నింటినీ ఒకే గాటున కడుతూ మస్క్ చేసిన ప్రకటన తప్పు అని వ్యాఖ్యానించారు. భారతీయ ఈవీఎంలు సురక్షితమైనవని, వీటికి బ్లూటూత్, వైఫై, ఇంటర్నెట్ లాంటి కనెక్టివిటీ ఏదీ ఉండదని పేర్కొన్నారు. ఈవీఎంలను రీప్రోగ్రామ్ కూడా చేయడానికి కుదరదని తెలిపారు. భారత్‌లానే ఈవీఎంలను తయారుచేయవచ్చని, అవసరమైతే దీనిపై శిక్షణ ఇవ్వడానికి కూడా సంతోషమేనని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై మస్క్ మరోసారి స్పందిస్తూ.. 'ఏదైనా హ్యాకింగ్ చేయడం సాధ్యమే' అని బదులిచ్చారు. దీనిపై రాజీవ్ చంద్రశేఖర్ స్పందిస్తూ.. 'ఏదైనా సాధ్యమే అనేది సాంకేతికంగా నిజమే. ల్యాబ్ స్థాయి సాంకేతికత, సరిపడా వనరులు ఉంటే విమాన నియంత్రణతో సహా ఏ వ్యవస్థనైనా హ్యాక్ చేయవచ్చని, కానీ ఈ వాదన ఈవీఎంలకు వర్తించదన్నారు. పేపర్ ఓటింగ్‌తో పోలిస్తే ఈవీఎంలు సురక్షితమైనవని, నమ్మదగినవని పేర్కొన్నారు. రాజీవ్ చంద్రశేఖర్ వ్యాఖ్యలకు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్ కౌంటర్ ఇచ్చారు. 'ఏదైనా సాధ్యమే' అన్నప్పుడు ఈవీఎంల హ్యాకింగ్ కూడా సాధ్యమే కదా అన్నారు. భారతీయ ఈవీఎంలను దేవుడు రక్షిస్తున్నాడా? అని ప్రశ్నించారు.

ఈవీఎంను పరిశీలించే అనుమతి లేదు: రాహుల్

ఎలాన్ మస్క్ చేసిన ట్వీట్ భారత రాజకీయ వర్గాల్లో దుమారం రేపింది. ఇదే సమయంలో ముంబైలో శివసేన(ఏక్‌నాథ్ షిండే) ఎంపీ రవీంద్ర వైకర్ బావమరిది కౌంటింగ్ కేంద్రంలో ఫోన్‌తో ఈవీఎంను అన్‌లాక్ చేశాడనే వార్తలు కూడా రావడంతో ఒక్కసారిగా ఈవీఎంలపై అనుమానాలు రేకెత్తాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మస్క్ ట్వీట్‌పై స్పందించారు. ఈ విషయమై రాహుల్ గాంధీ స్పందిస్తూ.. 'భారత్‌లో ఈవీఎంలు 'బ్లాక్ బాక్స్'గా మారాయి. ఎవరూ వీటిని పరిశీలించడానికి అనుమతి లేదు. మన ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై తీవ్రమైన ఆందోళనలు తలెత్తుతున్నాయి. సంస్థల్లో జవాబుదారీతనం లేనప్పుడు ప్రజాస్వామ్యం బూటకంగా మారుతుంది. మోసానికి గురవుతుంది.' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ.. 'సాంకేతికత అనేది సమస్యలను తొలగించాలి. ఒక వేళ సమస్యలను కలిగిస్తే దానిని వెంటనే నిలిపివేయాలి. ప్రపంచవ్యాప్తంగా ఈవీఎంలను ట్యాంపర్ చేసే ముప్పు ఉందని ప్రఖ్యాత సాంకేతిక నిపుణులు చెప్తున్నప్పుడు బీజేపీ ఎందుకు ఈవీఎంలను వినియోగించేందుకే మొగ్గు చూపుతున్నదో స్పష్టం చేయాలి' అని డిమాండ్ చేశారు.

కౌంటింగ్‌లో గోల్‌మాల్?!

మొదటిపేజీ తరువాయి...

ఉన్నాయని పేర్కొన్నది. 543 నియోజకవర్గాలకుగానూ డామన్ డయ్యూ, లక్షద్వీప్, కేరళలో అట్టింగల్ మినహా దాదాపు అన్ని స్థానాల్లో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని.. పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు సరిపోలడం లేదని తెలిపింది. ఏకంగా 140కిపైగా లోక్‌సభ నియోజకవర్గాల్లో ఈవీఎంలలో పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు అధికంగా ఉన్నాయని, ఈ వ్యత్యాసం 2 ఓట్ల నుంచి 3,811 ఓట్ల వరకు ఉన్నదని ఇండిపెండెంట్ జర్నలిస్టు పూనమ్ అగర్వాల్ తన ఆర్టికల్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా ఈవీఎంలలో పోలైన ఓట్ల కంటే తక్కువగా ఓట్లు లెక్కించిన నియోజకవర్గాలు కూడా అధిక సంఖ్యలో ఉన్నాయని చెప్పారు.

పలు చోట్ల స్వల్ప మెజార్టీతో విజయాలు

కొన్ని నియోజకవర్గాల్లో పోలైన ఓట్లు, లెక్కింపు మధ్య రెండు ఓట్ల తేడా ఉన్నదని అగర్వాల్ పేర్కొన్నారు. ఆయా స్థానాల్లో చాలా తక్కువ మార్జిన్‌తో గెలుపోటముల నిర్ణయం జరిగిందని వెల్లడించారు.

- **వాయువ్య ముంబై(మహారాష్ట్ర):** 9,51,580 ఈవీఎం ఓట్లు పోలవగా, 9,51,582 ఓట్లు లెక్కించారు. అంటే రెండు ఓట్లు అధికంగా లెక్కించారు. ఈ స్థానంలో శివసేన(షిండే వర్గం) అభ్యర్థి కేవలం 48 ఓట్ల తేడాతో గెలిచారు.
- **జైపూర్ రూరల్(రాజస్థాన్):** 12,38,818 ఓట్లు పోలవగా, 12,37,966 ఓట్లను లెక్కించారు. ఇక్కడ 852 ఓట్ల తేడా కనిపిస్తున్నది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి 1,615 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.
- **కంకేర్(ఛత్తీస్‌గఢ్):** 12,61,103 ఈవీఎం ఓట్లు పోలవగా, 12,60,153 మాత్రమే లెక్కించారు. 950 ఓట్లు కౌంటింగ్‌లోకి రాలేదు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి 1,884 ఓట్ల తేడాతో గెలిచారు.
- **ఫరూకాబాద్(యూపీ):** 10,32,244 ఈవీఎం ఓట్లు పోలవగా, 10,31,784 మాత్రమే లెక్కించారు. 460 ఓట్లను లెక్కించలేదు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి 2,678 ఓట్ల మెజార్టీతో గెలిచారు.

విమర్శల తర్వాతనే కచ్చితమైన వివరాలు

లోక్‌సభ ఎన్నికలు దశలవారీగా జరుగుతున్న సమయంలో ఎన్నికల సంఘం కచ్చితమైన పోలైన ఓట్ల సంఖ్యకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు. రాజకీయ పార్టీలు, సామాజిక కార్యకర్తల డిమాండ్ తర్వాతనే విడుదల చేయడం గమనార్హం.

పూనమ్ అగర్వాల్ ప్రకారం..

ఎక్కువగా ఓట్లు లెక్కించిన టాప్-3 స్థానాలు

పార్లమెంటరీ నియోజకవర్గం	లెక్కించిన ఓట్లు	పోలైన ఓట్లు	తేడా
కరీంఘంజ్(అస్సాం)	11,40,349	11,36,538	3,811
ఒంగోలు(ఆంధ్రప్రదేశ్)	14,01,174	13,99,707	1,467
మండ్లా(మధ్యప్రదేశ్)	15,31,950	15,30,861	1,089

తక్కువగా ఓట్లు లెక్కించిన టాప్-3 స్థానాలు

పార్లమెంటరీ నియోజకవర్గం	లెక్కించిన ఓట్లు	పోలైన ఓట్లు	తేడా
తిరువళ్లూరు(తమిళనాడు)	14,13,947	14,30,738	-16,791
కొక్రాఝార్(అస్సాం)	12,29,546	12,40,306	-10,760
ధేన్‌కనాల్(ఒడిశా)	11,84,033	11,93,460	-9,427

ఓట్ల లెక్కింపులో 'ఓటీపీ' దుమారం

- ఎన్డీయే అభ్యర్థి బావమరిది చేతిలో పోలింగ్ సిబ్బంది ఫోన్
- ఓటీపీతో ఈవీఎం అన్‌లాక్ అంటూ వార్తలు.. ఖండించిన రిటర్నింగ్ అధికారి

ముంబై : ముంబైలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో జరిగిన ఓ సంఘటన దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. జూన్ 4న కౌంటింగ్ రోజు ముంబై వాయువ్య నియోజకవర్గ ఎన్డీయే అభ్యర్థి రవీంద్ర వైకర్ బావమరిది మంగేశ్ పందిల్కర్ చేతిలో మొబైల్ ఫోన్ ఉన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇది ఎన్నికల అధికారి ఫోన్ అని, దీనికి వచ్చిన ఓటీపీతోనే ఈవీఎంను అతడు అన్‌లాక్ చేశాడని ఒక ఆంగ్ల పత్రికలో సంచలన కథనం ప్రచురితమైంది.ఈవీఎంల వినియోగంపై దేశంలో చర్చ జరుగుతున్న వేళ ప్రచురితమైన ఈ వార్తతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఈ వ్యవహారం చోటు చేసుకున్న ముంబై

వాయువ్య లోక్‌సభ నియోజకవర్గంలో కేవలం 48 ఓట్ల మెజారిటీతో ఎన్డీయే బలపర్చిన శివసేన(ఏక్‌నాథ్ షిండే) అభ్యర్థి రవీంద్ర వైకర్ గెలిచారు. దీంతో ఇది మరింత అనుమానాలకు తావిచ్చింది.ఈ వ్యవహారంపై ముంబై వాయువ్య నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వందన సూర్యవంశీ స్పందించారు. ఈవీఎంలను అన్‌లాక్ చేయడానికి ఓటీపీ అవసరం లేదన్నారు. కౌంటింగ్ చేయడానికి ఓటీపీ అవసరం లేదని, డాటా ఎంట్రీ చేయడానికి మాత్రం అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఓటీపీ వస్తుందని తెలిపారు.జోగేశ్వరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన డాటా ఎంట్రీ ఆపరేటర్ దినేశ్ గురవ్ వ్యక్తిగత ఫోన్ మాత్రం ఒక అనధికార వ్యక్తి దగ్గర లభించిందని పేర్కొన్నారు. ఇండియా కూటమి పార్టీల నేతలు ఈ వార్తను జత చేసి సోషల్ మీడియా వేదికగా ఈవీఎంల విశ్వసనీయతపై అనుమానాలు వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

12 రోజుల్లో 1000 కిలోమీటర్ల పరుగు

న్యూఢిల్లీ: సింగపూర్‌కు చెందిన అల్ట్రా మారథానర్ నటాలీ దౌ(52) 12 రోజుల్లో ఏకంగా వెయ్యి కిలోమీటర్లు పరుగెత్తి అసాధారణ కార్యాన్ని సాధించారు. ఎండలు భయపెట్టినా, తుంటి గాయం బాధించినా.. వేసుకున్న బూట్లు కరిగిపోయినా ఆమె తన పరుగును ఆపలేదు. రోజూ కనీసం 84 కిలోమీటర్లు పరుగెత్తి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. థాయిల్యాండ్, మలేసియా, సింగపూర్‌ల గూండా సాగిన ఆమె పరుగు ఈ నెల 5న ముగిసింది. 'అత్యంత వేగంగా 1000 కిలోమీటర్ల థాయ్‌లాండ్-సింగపూర్ అల్ట్రామారథాన్' పూర్తి చేసిన రికార్డ్ ఆమె సొంతమైంది.

ఉక్రెయిన్ డిక్లరేషన్‌పై సంతకానికి భారత్ దూరం

స్విట్జర్లాండ్: ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనడంపై జరిగిన చర్చల అనంతరం తుది ప్రకటనపై భారత్ సహా 7 దేశాలు సంతకాలు చేయలేదు. భారత్, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మెక్సికో, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఈ ప్రకటనపై సంతకాలు చేయలేదని స్విట్జర్లాండ్ ప్రభుత్వం ఆదివారం జారీ చేసిన ప్రకటనలో తెలిపింది. ఈ చర్చల్లో సుమారు 90 దేశాలు పాల్గొన్నాయని చెప్పింది. ఈ సదస్సుకు హాజరైన దేశాల్లో అబ్జర్వర్‌గా పేర్కొనబడిన బ్రెజిల్ కూడా తుది ప్రకటనపై సంతకం చేయలేదు. రష్యాతో శాంతి ఒప్పందానికి ఉక్రెయిన్ భౌగోళిక సమగ్రతే ప్రాతిపదిక కావాలని సదస్సులో పాల్గొన్న దేశాలు పిలుపునిచ్చాయి.

ఐస్‌క్రీమ్‌లో జెర్రి!

నోయిడా: ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన ఐస్‌క్రీమ్‌లో బొటనవేలు వచ్చినట్టు ఇటీవల ఓ వ్యక్తి పేర్కొనడం కలకలం రేపగా, తాజాగా తాను కొనుగోలు చేసిన ఐస్‌క్రీమ్‌లో జెర్రి ఉన్నట్టు నోయిడా మహిళ పేర్కొనడం చర్చనీయాంశమైంది. దీనిపై స్థానిక ఆహార భద్రతా విభాగం సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నది. ఐస్‌క్రీమ్ శాంపిళ్లను పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపింది.

గుజరాత్‌లో రూ.62 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

ద్వారక: దేవభూమి ద్వారకలో పెద్దయెత్తున మాదకద్రవ్యం చరస్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్‌లోని ద్వారకా జిల్లా సముద్ర తీరంలో గత 10 రోజులుగా నీటిలో కొట్టుకు వచ్చిన 62 కోట్ల విలువైన చరస్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కోస్తా ప్రాంతంలోని సముద్రంలో స్మగ్లింగ్ సమయంలో దాడుల భయంతో స్మగ్లర్లు వీటిని నీటిలో విడిచిపెట్టి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

ఆర్బీఐకి రిస్క్ మేనేజర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ).. అంతర్జాతీయ పురస్కారాన్ని అందుకుంది. రిస్క్ మేనేజర్ ఆఫ్ ద ఇయర్-2024కు ఎంపికైంది. అవార్డును ఆర్బీఐ తరపున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోరంజన్ మిశ్రా అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఆర్బీఐ ఓ సందేశాన్ని పోస్ట్ చేసింది. లండన్‌కు చెందిన పబ్లిషింగ్ హౌస్ సెంట్రల్ బ్యాంకింగ్ ఏటా ఈ అవార్డులను ప్రకటిస్తుంది.

రష్యా నిర్బంధ కేంద్రంలో ఖైదీల అరాచకం

మాస్కో, జూన్ 16: రష్యాలోని ఒక నిర్బంధ కేంద్రంలో అరాచకానికి పాల్పడిన ఖైదీలను ఆదివారం భద్రతా దళాలు కాల్చి చంపాయి. ఇస్లామిక్ ఉగ్రవాదులతో సంబంధాలున్నట్టు భావిస్తున్న ఆరుగురు ఖైదీలు రోస్తోవ్-అన్-డాన్ నగరంలోని నిర్బంధ కేంద్రం-1లో అక్కడ విధి నిర్వహణలో ఉన్న ఇద్దరు ఉద్యోగులను నిర్బంధించి బెదిరింపులకు పాల్పడ్డారు. వారి వద్ద మారణ ఆయుధాలు ఉన్నట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రంగంలోకి దిగిన భద్రతా దళాలు వారిని కాల్చి చంపి ఉద్యోగులను సురక్షితంగా విడిపించారు.

దర్శన్, పవిత్రకు పెండ్లి కాలేదు

బెంగళూరు: తన అభిమాని రేణుకాస్వామిని హత్య చేసిన ఆరోపణలపై అరెస్టయి పోలీస్ కస్టడీలో ఉన్న కన్నడ హీరో దర్శన్ కేసులో దర్యాప్తు ముమ్మరంగా సాగుతున్నది. ఈ కేసులో అరెస్టయిన దర్శన్ ప్రియురాలు పవిత్రా గౌడ్, దర్శన్ భార్యాభర్తలంటూ జరుగుతున్న ప్రచారాన్ని దర్శన్ న్యాయవాది అనిల్ బాబు ఖండించారు. పవిత్రాగౌడ్‌ను దర్శన్ రెండో వివాహం చేసుకున్నాడని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. ఆయన అగ్నిసాక్షిగా పెండ్లి చేసుకున్న విజయలక్ష్మీతోనే ఉన్నారని, పవిత్రాగౌడ్ కేవలం సహనటి, స్నేహితురాలు మాత్రమేనని స్పష్టం చేశారు.

12వ తరగతి పాఠ్యపుస్తకంలో బాబ్రీ మసీదు పదం తొలగింపు

న్యూఢిల్లీ: ప్రస్తుతం మార్కెట్లో లభ్యమవుతున్న 12వ తరగతి పొలిటికల్ సైన్స్ కొత్త ఎడిషన్ పాఠ్యపుస్తకంలో ఎన్‌సీఈఆర్‌టీ పలు మార్పులు చేసింది. 'బాబ్రీ మసీదు' అనే పదాన్ని పూర్తిగా తొలగించి దాన్ని 'మూడు గుమ్మటాల నిర్మాణం' (త్రీ-డోమ్డ్ స్ట్రక్చర్)గా సంబోధించడం ఈ మార్పుల్లో ప్రధానమైనది. అలాగే రాముడి రథయాత్ర, రామ జన్మభూమి ఉద్యమంలో కరసేవకుల పాత్ర, బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం చెలరేగిన హింస, రాష్ట్రపతి పాలనను విధించడం తదితర అంశాలతో అయోధ్య చాప్టర్‌లో ఉన్న కంటెంట్‌ను నాలుగు పేజీల నుంచి రెండు పేజీలకు కుదించింది.

అల్లర్ల గురించి ఎందుకు బోధించాలి?

విద్యలో ద్వేషం, హింస పాత్యాంశాలుగా ఉండకూడదని, వాటిపై విద్యార్థులు దృష్టి సారించకూడదని ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీ అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు బోధించే అంశాలను కాషాయీకరిస్తున్నారన్న ఆరోపణలను తోసిపుచ్చారు. సానుకూల ఆలోచనలతో కూడిన పౌరులను తయారు చేయాలనుకొంటున్నామని, హింసాత్మక ప్రవృత్తితో కూడిన వ్యక్తులను కాదని స్పష్టం చేశారు.

నీట్‌లో అక్రమాలు నిజమే

- రెండు చోట్ల వెలుగులోకి వచ్చాయి
- కేంద్ర విద్యా శాఖ మంత్రి అంగీకారం
- నేరాన్ని ఒప్పుకున్న ఇద్దరు నిందితులు
- 'నీట్' ఓ స్కామ్ అన్న స్టాలిన్
- అక్రమాల ఆరోపణలపై సుప్రీంకోర్టు కమిటీతో దర్యాప్తు జరిపించాలి
- రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ డిమాండ్

న్యూఢిల్లీ/చెన్నై, జూన్ 16: నీట్ పరీక్షకు సంబంధించి రెండు చోట్ల అక్రమాలు వెలుగులోకి వచ్చాయని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అంగీకరించారు. అయితే ఈ అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొన్నదని, విద్యార్థులు, తల్లిదండ్రులు భయపడొద్దని ఆయన ఆదివారం ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ అన్నారు. సుప్రీంకోర్టు సూచన మేరకు 1,563 మంది విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షలు నిర్వహించే బాధ్యతలు కలిగిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)లో చాలా మెరుగుపడాల్సిన అవసరం ఉన్నదని కేంద్ర మంత్రి అన్నారు. ఎన్టీఏ ఉన్నతాధికారులైనా దోషులుగా తేలితే, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. గుజరాత్, బీహార్‌లలో నీట్ పరీక్షలో అక్రమాలపై వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఆయా రాష్ట్రాల్లో పలువురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

సామాజిక న్యాయానికి వ్యతిరేకం

మెరిట్‌కు కొలమానమనే ముసుగులో ఉన్న నీట్ ఒక 'స్కామ్' అని తమిళనాడు సీఎం, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ఆరోపించారు. ఈ జాతీయ స్థాయి పరీక్ష విద్యార్థుల ప్రయోజనాలకు, సామాజిక న్యాయం, పేదలకు వ్యతిరేకంగా ఉన్నదని అన్నారు. నీట్ పరీక్షను సమర్థించుకోవడం ఆపాలని కేంద్ర ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రస్తుతం నీట్ చుట్టూ రేగిన వివాదాలు దాని ప్రాథమిక అసమాన స్వభావాన్ని చూపుతున్నాయని స్టాలిన్ ఎక్స్ పోస్టులో అభిప్రాయపడ్డారు. వేలాది సంవత్సరాల పాటు విద్య నిరాకరణకు గురైన సమాజంలో.. అణచివేతకు గురైన వారు ఉన్నతి సాధించేలా మరిన్ని అవకాశాలు ఇవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. అయితే అందుకు విరుద్ధంగా నీట్ అలాంటి విద్యార్థులకు అవకాశాలను నాశనం చేస్తున్నదని విమర్శించారు. కోట్లాది రూపాయలు లంచాలు తీసుకొని ఓఎంఆర్ షీట్లను ట్యాంపరింగ్ చేశారన్న ఆరోపణలపై గుజరాత్ పోలీసులు ఇన్విజిలేటర్లపై కేసు నమోదు చేశారని తెలిపారు.

రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలి

నీట్ అక్రమాల ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన అధికారులతో దర్యాప్తు జరిపించాలని కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఈ పరీక్షను ఎలా నిర్వహించాలనే అంశంపై కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలని కోరారు. నీట్ ఆరోపణలపై ప్రధాని మోదీ మౌనంగా ఉండటం సరికాదని అన్నారు. నీట్ అంశాన్ని రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో గట్టిగా లేవనెత్తాలని ఆయన ప్రతిపక్ష పార్టీలను కోరారు.

నేరాన్ని అంగీకరించిన ఇద్దరు నిందితులు

బీహార్‌లో నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనలో తమ పాత్రను ఇద్దరు నిందితులు అంగీకరించారని పోలీస్ అధికారి ఒకరు ఆదివారం వెల్లడించారు. వీరిలో దనాపూర్ మున్సిపల్ కౌన్సిల్‌లో పనిచేసే సికందర్ యద్వేందు అనే జూనియర్ ఇంజినీర్ ఒకరు కాగా, పరీక్షకు ముందు రోజు ప్రశ్నలకు జవాబులను బట్టీ కొట్టినట్టు అంగీకరించిన ఆయుష్ కుమార్ అనే అభ్యర్థి మరొకరు అని తెలిపారు. పరీక్షకు ఒక్కరోజు ముందు అమిత్, నితీశ్ అనే ఇద్దరు వ్యక్తులు తాము పొందిన ప్రశ్నాపత్రాన్ని దాదాపు 30 మంది విద్యార్థులతో ప్రశ్నలకు కంఠస్తం చేయించారని సికందర్ చెప్పారు.

సోమ్ లిక్కర్ ఫ్యాక్టరీలో బాల కార్మికులకు విముక్తి

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని రైసెన్‌లో ఉన్న సోమ్ లిక్కర్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న 60 మంది బాల కార్మికులకు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) విముక్తి కల్పించింది. ఇక్కడ బాలల చేత వెట్టి చాకిరీ చేయిస్తున్నారని అనేక ఫిర్యాదులు రావడంతో, ఎన్‌సీపీసీఆర్ చైర్మన్ ప్రియాంక్ కనుంగో ఆకస్మికంగా ఈ డిస్టిలరీలో తనిఖీలు నిర్వహించారు. 60 మందికిపైగా బాలలు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో పని చేస్తున్నారని వెల్లడైంది. వీరిలో 20 మంది మైనర్ బాలికలు ఉన్నట్లు గుర్తించారు. వీరంతా శరీరంపైనా రసాయనాల ప్రభావంతో ఏర్పడిన భయానక గాయాలను గమనించారు.

ఢిల్లీలో ముదిరిన నీటి సంక్షోభం

పైప్ లైన్లకు పోలీస్ పహరా కల్పించాలని ఆప్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: న్యూఢిల్లీలో 'నీటి సంక్షోభం' తీవ్ర స్థాయికి చేరుకుంది. ఆదివారం నగరంలో బీజేపీ చేపట్టిన నిరసనలు ఉద్రిక్తతను రేపాయి. ఢిల్లీ జల్ బోర్డ్(డీజేబీ) క